క్లుప్తంగా

రంజాన్ తోఫా కిట్లు పంపిణీ



శాంతినగర్: పట్టణ, వడ్డేపల్లి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. శాంతినగర్, వడ్డేపల్లిలోని 20 ముస్లిం కుటుంబాలకు సరుకులు, రూ.300 నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ షేక్ అస్లాం షరీఫ్, దాసువరం నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, మాలిక్, ఖలీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



అలంపూర్: నియోజక వర్గంలోని ఎంపీటీసీలతో పాటు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిశారు. ఆదివారం కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో వారు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. అలంపూర్, మానవపాడు, వడ్డేపల్లి మండలానికి చెందిన నాయకులు ఎమ్మెల్సీ ప్రతిమ బహూకరించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రానికి సోమవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి రానున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల లక్ష్మినారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అలంపూర్: నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం పర్యటిస్తారని క్యాంపు కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మానవపాడు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు, ఉండవెల్లి మండలంలోని రైతువేదికలో, అలంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో 3 గంటలకు చెక్కులు పంపిణీ చేస్తారని వివరించారు.

బాధితుడికి పరామర్శ



కేటీదొడ్డి: మండలంలోని కుచినెర్లకు చెందిన గోపి వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేకు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వైద్యులకు ఫోన్ చేసి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

శాంతినగర్: మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని వడ్డేపల్లి రైతులు కోరారు. వడ్డేపల్లి మండలంలోని ఆర్డీఎస్, బోరు బావుల కింద యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్న ధాన్యం ప్రస్తుతం కోతలు కోస్తున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందని రైతులు వాపోయారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.1950 మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు లేనందున దళారులకు తక్కువ ధరకే విక్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు.

చెక్కుల పంపిణీ

పెబ్బేరు: వనపర్తి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పెబ్బేరుకు చెందిన బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన లక్ష్మీదేవమ్మకు రూ.60 వేలు, రాములమ్మ రూ.33,500 చెక్కులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, సాయినాథ్, పాల్గొన్నారు.

పంట విక్రయాలకు అవస్థలు

మార్కెట్ సబ్ యార్డ్ ఉన్నా రైతులకు ఇబ్బందులు

- మౌలిక వసతులు కల్పించని ప్రభుత్వం
- నిర్వహణ భారంతో వ్యాపారులు దూరం



శిథిలమైన కమిషన్ మర్చంట్ భవనాలు

అయిజ: రైతులు పండించిన ధాన్యం క్రయ విక్రయాలు జరిపేందుకు ప్రభుత్వం 1993లో అయిజ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌లో కమిషన్ మర్చంట్‌ను ప్రారంభించింది. కొన్నేళ్ల పాటు మండలంలోని రైతులతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి కూడా రైతులు కమిషన్ మర్చంట్‌కు సాగుచేసిన పంటలను తీసుకొచ్చి విక్రయించేవారు. ఏడు సంవత్సరాల వరకు కమిషన్ మర్చంట్ ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో అటు రైతులకు ఇటు వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కాల క్రమేనా కమిషన్ మర్చంట్ నిర్వహణ భారంగా మారింది. కావలసిన ఏర్పాట్లను ప్రభుత్వం సమకూర్చలేదు. కనీస వసతులకు చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కమిషన్ మర్చంట్ యజమానులకు అనేక సమస్యలు ఎదురవుతున్నా కొన్నేళ్లపాటు నెట్టుకొచ్చారు. కాలక్రమేనా ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో కమిషన్ మర్చంట్ యజమానులు అందరు తప్పుకున్నారు. 2006లో కమిషన్ మర్చంట్ పూర్తిగా మూతపడింది. దీని ప్రారంభించేందుకు ఇంతవరకు అటు అధికారులుకాని, ఇటు ప్రజా పతినిధులుగాని కృషి చేయలేదు.

వ్యయ ప్రయాసాలతో ధాన్యం తరలింపు

మండలంలో మొత్తం 68673 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనిలో 57637 ఎకరాలలో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆర్డీఎస్ ఆయకట్టులో 7,500 ఎకరాల భూమిలో అన్నదాతలు వరి సాగుచేస్తున్నారు. మిగతా గ్రామాల్లో బోరుబావులనుంచి లభ్యమయ్యే సాగునీటి ఆధారంగా రైతన్నలు దాదాపు 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు వేస్తున్నారు. 30 వేల ఎకరాల్లో రైతన్నలు వేరుశనగ, పప్పుశనగ, కంది మొదలగు పంటలు పండిస్తున్నారు. కొన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తున్నా మిగిలిన పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకోవడానికి రైతన్నలు నానా అగచాట్లు పడుతున్నారు. కొన్ని పంటలను పొరుగు రాష్ట్రమైన కర్నాటకలోని రాయచూర్ జిల్లాలో ఉన్న మార్కెట్ యార్డ్‌లో విక్రయిస్తున్నారు. వేరుశనగ, పత్తి తదితర పంటలను గద్వాల జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్నారు. కొంతకాలం ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మిగనూర్ మార్కెట్‌కు రైతులు వివిధ రకాల పంటలను తరలించి విక్రయించారు. 2009లో వచ్చిన వరదల్లో నాగలదిన్నె బ్రిడ్జి కూలిపోవడంతో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌కు రైతన్నలు పోలేని పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రానికి రాయచూర్ మార్కెట్ యార్డ్ 50 కిలోమీటర్లు, గద్వాల మార్కెట్ యార్డ్‌ల 30 కిలోమీటర్ల దూరం ఉంది.

మండలంలోని కొన్ని గ్రామాలకు అధిక దూరం కావడంతో పండించిన పంటలను మార్కెట్ యార్డ్‌కు తరలించడానికి రవాణా ఖర్చు తడిసి మోపడవుతుంది. అన్నదాతల కష్టాలను దష్టిలో ఉంచుకొని కమిషన్ మర్చంట్‌ను పునర్ ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం



మండలంలో కమిషన్ మర్చంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని సంవత్సరాలు మార్కెట్ సబ్ యార్డ్‌లో కమిషన్ మర్చంట్ నిర్వహించారు. నిర్వహణ సరిగా లేక మర్చంట్ మూతపడింది. రైతులు వ్యయ ప్రయాసాలు పడి గద్వాల్‌కు, రాయచూర్‌లలో ధాన్యం విక్రయిస్తున్నారు.

– త్రివిక్రమ్‌రెడ్డి, రైతు, సింధనూరు

మౌలిక వసతులు కల్పించాలి



జిల్లాలోనే అయిజ పెద్ద మండలం. ఇక్కడ కూడా కమిషన్ మర్చంట్ లేకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం మార్కెట్ సబ్ యార్డ్‌లో కమిషన్ మర్చంట్‌ను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసే విధంగా కృషి చేయాలి.

– సత్యన్న, రైతు, అయిజ

వ్యాపారులు ముందుకు రావడం లేదు



గతంలో వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌లో కమిషన్ మర్చంట్‌లు నిర్వహించారు. వివిధ కారణాలతో మూతపడింది. దీని నిర్వహణ కోసం వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఎవరైన ముందుకొస్తే మర్చంట్‌ను ఏర్పాటు చేస్తాం.

– పుష్పమ్మ, జిల్లా మార్కెటింగ్ అధికారి

రైతులు ఆర్థికంగా ఎదగాలి



బల్గెరలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: రైతుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. ఆదివారం బల్గెరలో రైతు సంబరాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత పాలకులు మండలాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నియోజక వర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు వలసలు వెళ్లేవారని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, ఇంటింటికి తాగునీరు, ఆసరా పింఛన్లు వంటి పథకాలను అమలు చేస్తూ దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. బీజేపీ నాయకులకు భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ విజయ్ కుమార్, జెడ్పీటీసీలు బాసు శ్యామల, పద్మ, రాజశేఖర్, ఎంపీటీసీ రూపవతి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఉరుకుందు, వెంకటన్న పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

గద్వాల రూరల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన ఒంటిలపేటకు చెందిన పరుశరాముడికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.25 వేలు మంజూరయ్యారు. ఈమేరకు లబ్ధిదారుడికి ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గోవిందు, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, రమేష్, నవీన్‌రెడ్డి, బషీర్, పరుశరాముడు తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగం సేవలు ఆదర్శం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు సేవలు ఆదర్శంగా నిలిచాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వీరేశలింగం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కరణోద్యమం ఎంతో సమాజంతో ఎంతో మార్పువచ్చిందన్నారు. మహిళల విద్య, అభ్యున్నతికోసం ఆయన చేసిన సామాజిక సంస్కరణ ఉద్యమాలు మరిచిపోలేమన్నారు. అదేవిధంగా శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లను, కార్యకర్తలకు పలు సలహాలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు పోలింగ్ బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ నాయకులు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి రిఫ్రిజిరేటర్ వితరణ



రిఫ్రిజిరేటర్ వితరణ చేస్తున్న గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్

గద్వాల రూరల్: వేసవికాలం దృష్టిలో ఉంచుకుని వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా అభ్యర్థుల కోసం గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్ రిఫ్రిజిరేటర్‌ను వితరణ చేశారు. ఆదివారం గ్రంథాలయంలో రిఫ్రిజిరేటర్‌ను ఏర్పాటు చేశారు. తాగునీరు అందించేందుకు కృషి చేసిన చైర్మన్‌కు పాఠకులు, అభ్యర్థులు ధన్యావాదాలు తెలిపారు. గతంలో కూడ గ్రంథాలయంలో కుర్చీలు ఇతర ఫర్నీచర్‌ను చైర్మన్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. శ్యాంసుందర్, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీలకు అన్యాయం



గద్వాల అర్బన్: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల్లో మైనార్టీలకు అన్యాయం చేశారని ఎంఐఎం మండల అధ్యక్షుడు రఫీ, పట్టణ అధ్యక్షుడు బంగి సుదర్శన్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా నిర్వహించిన డిప్ ప్రక్రియ అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒక వార్డులో 100 మందికి పైగా మైనార్టీలు ఉంటే మూడు డబుల్ బెడ్రూం ఎలా వస్తాయని ప్రశ్నించారు. రిజర్వేషన్ పేరుతో కోతలు విధించి నిజమైన అర్హులకు అన్యాయం చేశారన్నారు. పేద ముస్లిం కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని సాసనూలు గ్రామానికి చెందిన ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు ఆదివారం సాసనూలు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోతురాజు సోమనాద్రి సూచన మేరకు సేవాదళ్ సభ్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు నాగన్న, రాజు, డేవిడ్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికి న్యాయ సలహాలు



అమరచింత: శ్రీసత్యసాయి న్యాయ సలహా కేంద్రం ద్వారా ప్రతి ఒక్కరికి ఉచితంగా న్యాయ సలహాలు అందిండానికి శ్రీకారం చుట్టామని స్టేట్ ఆర్గనైజింగ్ హైకోర్టు న్యాయవాది పంకజ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూర్ పట్టణంలో ఆదివారం శ్రీసత్యసాయి మందిరంలో ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ప్రస్తుతం నిత్యం పలు సమస్యలతో, ఆర్థిక మోసాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురౌతున్నారని వెల్లడించారు. న్యాయం ప్రతి ఒక్కరి హక్కు అనే విషయాన్ని చాటి చెప్పేందుకే ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం న్యాయ సలహా కేంద్రంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారికి సత్వర న్యాయ సలహాలు అందిస్తామన్నారు.

పట్టణంలో తాగునీటి కష్టాలు



అయిజలోని దుర్గానగర్‌లో వాటర్ ట్యాంక్ నుంచి తాగునీటిని తీసుకెళ్తున్న కాలనీవాసులు



గట్టులో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న సర్పంచ్

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీలకు మూడు రోజుల నుంచి తాగునీరు సరఫరా చేయలేదు. దీంతో పట్టణ ప్రజలు ఆదివారం తాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డారు. వాటర్ ఫిల్టర్ చేసే ప్రదేశంలో మట్టిని తొలగించడానికి తాగునీటి సరఫరాను రెండు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే మూడో రోజు కూడా మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా చేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో 10 వార్డు కౌన్సిలర్ మేకల అనిత సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న కొన్ని కాలనీల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేయించారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

గట్టు: మండల కేంద్రంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఆదివారం సర్పంచ్ ధనలక్ష్మి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయించారు. వివిధ పనుల కారణంగా మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాకావడం లేదు. తాగునీటికి మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్న సందర్భంగా బస్టాండ్ ఏరియా, బీసీ కాలనీ, కమ్మరి వీధి, నేతాజీ చౌక్‌తో పాటుగా పలు వీధుల్లో ట్యాంకర్ల ద్వారా సర్పంచ్ నీటి సరఫరా చేయించారు. మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్లు శుభ్రం చేస్తున్నారని దీంతో తాగు నీటి సరఫరా నిలిచిందని సర్పంచ్ పేర్కొన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బాధితులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్ శివారులోని సర్వేనంబర్ 117 సర్వే చేసి బాధితులకు న్యాయం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కబ్జాకు గురైన భూమిని పరిశీలించి మాట్లాడారు. పట్టణానికి ఆనుకొని బత్తుల చిన్నయ్య భూమి పక్కన 111 సర్వే నంబర్ ఆనుకొని ఉండడంతో గతంలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణానికి అనుమతులు తీసుకొని 117 సర్వే నంబర్‌లో నిర్మాణం చేపట్టడంపై 2022లో అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించిన పాపానికి కుటుంబ సభ్యులపై 9వ తరగతి విద్యార్థిపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. అలాగే 447 సర్వే నంబరులో జద్చర్ల మహేష్‌శెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారికి భూమి ఉందని కొన్ని సంవత్సరాలుగా సరిహద్దులపై పంచాయితీ ఉండడంతో జిల్లా సర్వేకు పెట్టుకున్నట్లు తెలిపారు. బాధితులు మూడేళ్ల క్రితం ఇచ్చిన ఫిర్యాదు అధికారులు స్పందించి వెంటనే సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారన్నారు. ఆయన వెంట సత్తార్, విష్ణు, గోవిందు, బీసన్న, కురుమన్న, పెద్ద రాములు, శ్రీనివాసులు, విజయ్‌గౌడ్, మద్దిలేటి, నరేందర్, అంజన్న, రమేష్ తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అయిజ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలో యోబు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి 'మహిళా ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్' శనివారం రాత్రి ముగిసింది. ప్రథమ బహుమతి హరియాన జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50,016లు కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతి కర్నూలు జట్టు రూ. 30,016లు , తృతీయ బహుమతి వైజాక్ జట్టు రూ. 20.016లు, నాల్గో బహుమతి శ్రీకాకుళం జట్టు రూ. 15,016లు, ఐదో బహుమతి మైసూరు జట్టు రూ. 10,016లు గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. యోబు, నాయకులు ఆర్. శ్రీధర్, రామదాసు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం



బిజ్వారంలో పశు వైద్య కేంద్రం

మల్దకల్: మండలంలోని బిజ్వారం పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. 20 ఏళ్ల కిందట నాసిరకంగా నిర్మించడంతో గోడలు నెర్రెలుబారిన పడ్డాయని గ్రామస్తులు వాపోయారు. ఎప్పుడు గోడలు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని పశు వైద్య సిబ్బంది భయాందోళన గురవుతున్నారు. బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారికి మరమ్మతు చేపట్టండి



పెద్దపల్లి సమీపంలో రోడ్డుపై గుంత

మల్దకల్: మండలంలోని పెద్దపల్లి గ్రామ సమీపంలో అయిజ– గద్వాల ప్రధాన రహదారిపై రైతులు పైపులైను కోసం రెండు చోట్ల రోడ్డును అడ్డంగా తవ్వారు. దీంతో రోడ్డు గుంతలమయంగా తయారైంది. ఈ రహదారిగుండా వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తవ్విన గుంతలకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికై నా అధికారులు గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

అమరచింత: వేసవికాలంలో అగ్నిప్రమాదాలు అధికంగా చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. ఆత్మకూర్ పట్టణంలోని వర్తక సముదాయాలు, ప్రైవేట్ ఆస్పత్రులలో అగ్ని ప్రమాదాల నివారణపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ వాసన వస్తున్నప్పుడు ఎలా వ్యవహరించాలి, ప్రమాదం నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలనే విషయాలపై ప్రయోగాత్మకంగా ప్రజలకు వివరించారు.